క్లుప్తంగా

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని కృష్ణానదిలో స్నానాలు ఆచరించి శివాలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి శివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

తిరుమలలో భజన కీర్తనలు



అయిజ: తిరుమలలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సంకీర్తనలో భాగంగా సోమవారం మండలంలోని సంకాపురానికి చెందిన విజయ రాయ భజనమండలి సభ్యులు భజన కీర్తనలు ఆలపించారు. భజన కీర్తనలు ఆలపించిన వారిలో వెంకట్రాముడు, తిమ్మప్ప, దేవర శీను, నరసింహాచారి, చిన్న తమ్మప్ప, కృష్ణ, రాముడు, రవి ఉన్నారు.

యువకుడు బైండోవర్

కేటీదొడ్డి: సీఎం కేసీఆర్‌పై అసభ్యకరమైన పోస్టు పెట్టిన ఓ యువకుడిపై కేటీదొడ్డి పోలీసులు బైండోవర్ చేసి తహసీల్దార్ ముందు హాజరుపరిచారు. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు కేటీదొడ్డి మండల కేంద్రానికి చెందిన యువకుడు సీఎం కేసీఆర్‌కు ఫొటోన్ అసభ్యకరమైన వాట్సప్ సోషల్ మిడియాలో పోస్టు చేశాడు. దీని గమనించిన స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేయడంతో విచారించి బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం పట్టివేత



గద్వాల క్రైం: వేర్వేరు ఘటనల్లో మద్యం పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఘటన గ్రామీణ ఎస్ఐలు శ్రీకాంత్, ఆనంద్ తెలిపారు. గద్వాల మండలంలోని లత్తీపురం గ్రామానికి చెందిన నారాయణగౌడు మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో అతని ఇంట్లో సోదాలు చేసి 16 లీటర్ల మద్యం గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టణ శివారులోని దౌదర్‌పల్లి కాలనీలో జమ్మన్న ఇంట్లో తనిఖీ చేయగా 7.5 లీటర్ల మద్యం గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐలు తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా బెల్టు షాపును నడుపుతూ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు తనిఖీ చేశారు. మద్యం దాదాపు 8.7లీటర్లు ఉందని, దాని విలువ సుమారు రూ.3,260 వరకు ఉంటుందని ఎస్ఐ అశోక్‌బాబు పేర్కొన్నారు.

అలంపూర్ రూరల్: మండలంలోని ర్యాలంపాడ్ సమీపంలోని తుంగభద్ర నది వంతెన దగ్గర పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా జిల్లెలపాడ్‌కు చెందిన ఈ రవిగౌడ్, బోయ పవన్ కళ్యాణ్‌లు బెల్ట్‌షాపుకు మద్యం తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. మొత్తం 47.01 లీటర్ల మద్యం, బైకులను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ రూ.80,570 ఉంటుందని, పంచనామ నిర్వహించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

ప్రభుత్వ భవనాల ఏర్పాటు మరిచారు

రాజోళి: నూతన మండలంలో ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వ భవనాల విషయాన్ని ప్రభుత్వం పూర్తిగా మరిచిపోయిందని కేవీపీఎస్ నాయకుడు విజయ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కొత్తగా ఏర్పాటు చేసిన మండల కేంద్రంలో ఆయా శాఖలకు సంబంధించిన కార్యాలయాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, నేటి వరకు అద్దె భవనాల్లో, పాతబడిన భవనాల్లోనే కాలం వెల్లదీస్తున్నారని, నూతన భవనాలను మాత్రం నిర్మించడం లేదన్నారు. ఏళ్లు గడుస్తున్నా కనీసం కార్యాలయాలు కూడా ఏర్పాటు చేయకపోతే ప్రభుత్వం ప్రజలకు ఏమి చేసినట్లని ఆయన ప్రశ్నించారు.

అభివృద్ధికి పట్టం కట్టాలి

గట్టు: అభివృద్ధికి పట్టం కట్టాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్‌లు గొర్లఖాన్‌దొడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం గొర్లఖాన్‌దొడ్డిలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే కుమారుడు సాయిసాకేత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, సర్పంచు శంకరమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు వైద్యులు కరువు



పాల్వాయిలో మూతపడిన పశువైద్య కేంద్రం



బిజ్వారంలో పశువులకు వైద్యం చేస్తున్న సిబ్బంది

- మూతపడుతున్న పశువైద్య కేంద్రాలు
- మందుల కొరతతో గొర్రెల కాపర్ల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

మల్దకల్: జోగుళాంబ గద్వాల జిల్లాలో పశువైద్యులు లేక మూగజీవాలకు వైద్యం అందక గొర్రెల కాపర్లు పశువుల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 12 మండలాల్లోని పశువైద్య కేంద్రాలకు 19 మంది వైద్యులు ఉండాలి. కేవలం 6 మంది పశువైద్యులు మాత్రమే ఉన్నారు. దీంతో సిబ్బంది లేక పశు వైద్య కేంద్రాలు మూతపడ్డాయి. మండలంలో రెండు పశువైద్య కేంద్రాలతో పాటు ఆరు పశువైద్య ఉప కేంద్రాలున్నాయి. వాటికి మొత్తం 16 మంది సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం 6మంది సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మల్దకల్ పశువైద్య కేంద్రానికి డాక్టర్ వినయ్‌కుమార్ కేటీదొడ్డి మండల పశువైద్య కేంద్రం నుంచి డిప్యూటేషన్‌పై వచ్చారు. పాల్వాయిలో పనిచేస్తున్న డాక్టర్ యామినిసాయి గద్వాల జిల్లా కేంద్రంలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తుడంతో పాల్వాయి పశువైద్య కేంద్రం మూతపడింది. ఉన్న సిబ్బంది సక్రమంగా విధులకు రాకపోవడంతో గొర్రెల కాపరులు, పాడి పశువుల రైతులు ప్రతిరోజు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి వేలరూపాయల ఖర్చులు పెట్టుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. బిజ్వారం, విఠలాపురం, మద్దెలబండ గ్రామాలలోని పశువైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరడంతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో మొత్తం 25,628వేల గొర్రెలు, 15,136 పశువులున్నాయి. వాటిలో పశువులకు ఏడాదికి రెండు సార్లు, గొర్రెలకు ఏడాదికి మూడు సార్లు నట్టల నివారణ మందులు పంపిణీ చేయాలి. పాల్వాయిలో 25లక్షల వ్యయంతో నూతన బిల్డింగ్ నిర్మించిన డాక్టర్ లేకపోవడంతో మూతపడింది. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని రైతులు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మూగజీవాలకు వైద్యం అందేలా వైద్య సిబ్బందిని నియమించిసమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వైద్యులను ఏర్పాటు చేయాలి



పాల్వాయిలోని పశువైద్య కేంద్రానికి వైద్యుడు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. 25లక్షలతో నూతన భవనాన్ని నిర్మించిన డాక్టర్లు లేకపోవడంతో ఆ భవనం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా డాక్టర్‌ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

– ఈదన్న, పాల్వాయి

అధికారులు స్పందించాలి..



మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పశువైద్య ఉప కేంద్రాలకు సిబ్బంది లేకపోవడంతో గొర్రెల కాపరులు, పశువుల యాజమానులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోని సమస్యను పరిష్కరించాలి.

– గోవింద్, బిజ్వారం

చర్యలు తీసుకుంటాం

మండలంలోని వివిధ గ్రామాల్లో పశువైద్య సిబ్బంది కొరతతో గొర్రెల కాపరులు రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చింది. వెంటనే ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– పీ వెంకటేశ్వర్లు, జిల్లా పశువైద్యాధికారి

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమాభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ధరూరు మండలం గార్లపాడు ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి, గద్వాల మండలం చెనుగోనిపల్లికి చెందిన కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, దేవేందర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డిలతో మరికొందరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గ్రామాల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి అన్నారు. మండలంలోని ద్యాగదొడ్డి, మాల్‌దొడ్డి, వామన్‌పల్లి, మిర్జాపురం, గార్లపాడు, ఖమ్మంపాడులో ప్రచారం నిర్వహించారు.

మల్దకల్: కేసీఆర్ ప్రవేశ పెట్టిన వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని శేషంపల్లి, మల్దకల్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడు, ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీలు ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వైస్ ఎంపీపీ పెద్దవీరన్న, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



శాంతినగర్: అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరినట్లు కాంగ్రెస్ కార్యాలయం ప్రకటించింది. నియోజకవర్గంలోని అలంపూర్‌టౌన్, మానవపాడు మండలం శ్రీనగర్ నుంచి పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారందరికి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కండువాలు కప్పి ఆహ్వానించారు.

రోడ్డు మలుపులతో ప్రమాదం



అమరవాయి -బిజ్వారం గ్రామాల మధ్య మలుపు



కుర్తిరావులచెర్వు - మల్దకల్ మధ్య మలుపు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రోడ్ల మలుపుల వద్ద అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్దకల్ నుంచి మద్దెలబండ, అమరవాయి నుంచి బిజ్వారం, పెద్దొడ్డి నుంచి మల్దకల్, కుర్తిరావుల చెర్వు నుంచి మల్దకల్ గ్రామాల మధ్య ఉన్న రోడ్లపై మలుపులు వద్ద సూచికబోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాహనదారులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ఉన్న మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

మరమ్మతు చేపట్టండి



రాజోళి: దసరా సెలవుల సందర్భంగా పాఠశాలల్లో చిన్నపాటి మరమ్మతు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కొన్ని పాఠశాలల్లో కనీస వసతులు లేవని, మరికొన్ని చోట్ల భద్రత సౌకర్యాలు లేవని, ఇంకొన్ని పాఠశాలల్లో నీటి, మరుగుదొడ్ల సమస్యలున్నాయని పేర్కొన్నారు. అధికారులు, నాయకులు ఇప్పడైనా పాఠశాలలో సమస్యలు పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తరగతి గదులకు డోర్లు, గేట్లు వేసేందుకు తాళాలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, అధికారులు సమస్యలు పరిష్కరించాలని తెలిపారు.

మట్టితో గుంతల పూడ్చివేత



మట్టితో గుంతలు పూడ్చుతున్న పంచాయతీ సిబ్బంది

గద్వాల రూరల్: గద్వాల – రాయచూరు రహదారిలోని ధరూరులోని రైస్ మిల్ వద్ద నడిరోడ్డుపై గుంతలు పూడ్చి వాహనదారులకు ఇబ్బందులు తొలగించారు. పంచాయతీ అధికారులు మొత్రం మట్టితో తాత్కాలికంగా పూడ్చడం తప్పా శాశ్వత పరిష్కారం చేయడం లేదని వాహనదారులు పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో నడిరోడ్డుపై గుంతలు ఏర్పడడం వర్షాకాలం మరింత ఇబ్బందికరంగా ఉంటుందని, సంబంధిత అధికారులు ఎరుకలి వీధి వద్ద సీసీ వేయాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డికి చెందిన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ మాతృమూర్తి లక్ష్మీదేవి (70) అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట జోగులరవి, జగన్‌గౌడ్, చిన్నిబాబు, కార్యకర్తలు ఉన్నారు.

బహుజనులు ఎదగాలంటే బీఎస్పీని గెలిపించాలి



ఎర్రవల్లిచౌరస్తా: తెలంగాణ రాష్ట్రంలో బహుజనులు అభివృద్ధి చెంది ఆర్థికంగా ఎదగాలంటే బీఎస్పీ అధికారంలోకి రావాలని జిల్లా ఇన్‌చార్జ్ ఎంజీ కృష్ణ అన్నారు. బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి ప్రచారంలో భాగంగా సోమవారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఆయా కాలనీలను నాయకులతో కలిసి సందర్శించారు. మెనిఫెస్టో కర పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు తిరుపాల్, యువరాజు, కార్యకర్తలు, ఉన్నారు.

దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

గద్వాల రూరల్: బీఆర్ఎస్ పార్టీ నాయకులు దిగజారుడు రాజకీయాలను మానుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ తమ పార్టీకి చెందిన ధరూరు మండలం ఖమ్మంపాడు సర్పంచు పార్వతమ్మను బీఆర్ఎస్ పార్టీ నాయకులు బలవంతంగా పార్టీలోకి రమ్మని కండువాలు కప్పుతున్నారన్నారు. అనంతరం సర్పంచు పార్వతమ్మకు పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం కృష్ణారెడ్డి, రాజేష్, మాల శ్రీనివాసులు, హనుమంతరాయ, భీంరెడ్డి, అంజి ఉన్నారు.

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..



బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న విద్యార్థినులు



గట్టులో బతుకమ్మల ఊరేగింపు

గద్వాల: తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ బతుకమ్మను విద్యార్థినులు కీర్తించారు. సంప్రదాయ వస్త్రధారణతో అలరించారు. 'ఒక్కేసి పువ్వేసి సందమామ.. ఒక్క జాముయే సందమామ.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ పాటలు పాడారు. సోమవారం నవోదయ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. అధ్యాపకులు, విద్యార్థినీలు కళాశాల ఆవరణలో బతుకమ్మ సంబరాలు చేశారు. అనంతరం నిమజ్జనం చేశా రు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సరస్వతి సుధాకర్ మాట్లాడారు. బతుకమ్మ పండగ వారసత్వ సంపదగా మిగిలి ఉందని చెప్పారు.

గట్టు: ఐద్వా ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మను అలంకరించారు. మహిళలు, చిన్నారులు కలిసి ఆటపాటలతో కోలాటం, బతుకమ్మ ఆడారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి బావిలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద, మహిళా సంఘం సభ్యులు రాధ, జయమ్మ, శాంతమ్మ, సుజాత, లక్ష్మి, బజారమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

బహుజనులు ఆత్మగౌరవంతో బతకాలి



మాట్లాడుతున్న గొంగళ్ల రంజిత్‌కుమార్

గట్టు: నడిగడ్డ ప్రాంతంలో బహుజనులను రాజకీయంగా ఎదగకుండా అణగదొక్కే ప్రయత్నం చాలా కాలంగా కొనసాగుతోందని, బహుజనులు ఆత్మగౌరవంతో బతికేలా అవకాశం కల్పించాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ కోరారు. ఆదివారం రాత్రి ఆలూరు గ్రామంలో ప్రజా చైతన్యయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 70 ఏళ్లుగా గద్వాలలో ఒకే కుటుంబానికి అధికారం ఇచ్చినా, అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో బంగ్లా, బండ్ల కుటుంబాలకు ఓటు అనే అయుధంతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి కన్వీనర్ బుచ్చిబాబు, గట్టు మండల అధ్యక్షుడు బలరాంనాయుడు, నాయకులు వెంకట్రాములు, జమ్మన్న, నర్సింహులు, వీరేష్, వెంకటన్న, రఘుపతి, నర్సింహ, రాముడు వెంకటేష్ పాల్గొన్నారు.

శాంతినగర్: నడిగడ్డలో బహుజనులకు ఆత్మగౌరవం కావాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ అన్నారు. వడ్డేపల్లి పురపరిధిలోని శాంతినగర్‌లో నడిగడ్డ హక్కుల పోరాట సమితి అలంపూర్ సమన్వయకర్త నాగేష్ యాదవ్ అధ్యక్షతన అలంపూర్ ఆత్మగౌరవ సభను సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, కో కన్వీనర్ గొనింటి వీరేష్, నాయకులు దొడ్డన్న, కిషోర్, రవి, వీరేష్ పాల్గొన్నారు.

బీఎస్పీతో అన్ని వర్గాల వారికి న్యాయం



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ ఎంజీ కృష్ణ

మానవపాడు: అలంపూర్ నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీని ప్రతి ఒక్కరూ ఆదరించి గెలిపించాలని జిల్లా ఇన్‌చార్జ్ ఎంజీ కృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బీఎస్పీ రైతు భరోసా సభ వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మరొక తేదీని వెల్లడిస్తామన్నారు. బీఎస్పీ అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ అన్ని వర్గాల ప్రజలు ఆదరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరి రామ్‌ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపాల్, మండల అధ్యక్షుడు శాంతకుమార్, కన్వీనర్ కరెంట్ రవి, యువరాజ్, ప్రభుదాస్, వాల్మీకి సుంకన్న, నాగరాజు, లక్ష్మయ్య చారి పాల్గొన్నారు.

అబ్రహంకు బీఫాం ఇవ్వకుంటే రాజీనామా చేస్తాం



నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అయిజ: అలంపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన ఎమ్మెల్యే అబ్రహంకు బీఫాం ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశానికి అలంపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు సంకాపురం రాముడు, తనగల సీతారామిరెడ్డి మాట్లాడారు. అబ్రహంకు బీఆర్ఎస్ బీఫాం ఇవ్వకుంటే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రోడ్లను దిగ్బంధం చేయాలన్నారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి వద్ద జీతగాడిగా పనిచేసే వ్యక్తి విజేయుడుకి బీఫాం ఇప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఇది సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విజయ్, రాముడు, సీతారామిరెడ్డి, ఆర్ శ్రీధర్, మేకల నాగిరెడ్డి, ఆంజనేయుడు, మల్లికార్జున్ రెడ్డి, జయచంద్రారెడ్డి, భద్రయ్య, తిమ్మన్న, బడేసాబ్, కౌన్సిలర్ సీఎం సురేష్, రాణెమ్మ పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో మొక్కలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

అలంపూర్: ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీల్లో మొక్కలు పెంచాలని ఎంపీడీఓ గోవిందరావు అన్నారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ గోవిందరావు మాట్లాడుతూ 2023–24 వార్షిక సంవత్సరంలో నర్సరీలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో పదివేల కంటే ఎక్కువ మొక్కలు పెంచాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకు బ్యాగుల్లో మట్టి నింపి విత్తనాలు నాటాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో 10 మీటర్ల మేరకు ఉంటే 5 నర్సరీ బెడ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో 50 మందికి తక్కువ కాకుండా ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనులు కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీఓ రాజు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

గాయత్రీ దేవిగా అమ్మవారు

గద్వాల రూరల్: శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించినట్లు ఆలయ అర్చకులు కిష్టాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సాయంత్రం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించారు. మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులు అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనుసూయమ్మ కాలనీలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

శాంతినగర్: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శాంతినగర్‌లో వెలసిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు రెండో రోజు గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చన చేశారు.

భక్తి పుస్తకాల వితరణ

నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని కొలిచే స్తోత్రమాలిక పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు. శాంతినగర్‌లో వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వేద విజ్ఞ సమితి వారు పంపిన స్తోత్రమాలిక పుస్తకాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రావూరి సురేష్‌కుమార్, గాయత్రి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, అమరవాయి, మానవపాడు గ్రామాల్లో అమ్మవారికి ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని అంబా భవానిమాత గాయత్రి దేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దసరా నవరాత్రుల్లో భాగంగా రెండో రోజూ భవాని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. కోట్లగేరిలోని కాళికాదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

అర్ధనారీశ్వరిదేవిగా వాసవిమాత

మల్దకల్: మండల కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు అర్ధనారీశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు శ్రీనివాసులు, నాగరాజు, రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని గ్రామాల్లో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగాయి. రెండో రోజు బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో దుర్గామాత గాయత్రిదేవిగా, జ్ఞానస రస్వతి ఆలయంలో ధైర్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు.

అయిజ: మండల కేంద్రంలో కాళికాదేవి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి, అంబా భవాని ఆలయాల్లో భక్తులు నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆలయాల్లో అర్చకులు అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

రాజోళి: దేవి శరన్నవరాత్రులో భాగంగా అ మ్మవారు గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. మండల కేంద్రం రాజోళిలోని అంబా భవానిమాత ఆలయంలో ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చన చేసి, అమ్మవారి సేవలో తరించారు. ప్రత్యేక నైవేద్యం సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.



గట్టులోని భవానీ ఆలయంలో మహిళల పూజలు



ధరూరులో గాయత్రీ దేవిగా కాళికాదేవి



పుస్తకాలు ప్రదర్శిస్తున్న భక్తులు



ఉండవెల్లిలో గాయత్రీ దేవి అలంకరణలో..